క్లుప్తంగా

పెదబోగిలిలో పారిశుద్ధ్య పనులు



వీధుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి మేజరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ జె.తేరేజమ్మ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. హడ్కో హౌసింగ్ కాలనీలో పారిశుద్ధ్య పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి జె.వెంకటరావు పర్యవేక్షణలో నిరంతరం పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బస్సు పునఃప్రారంభం



చాకరాపల్లి వచ్చిన బస్సుకు కొబ్బరికాయ కొట్టిన సర్పంచ్ మోహనరావు

బలిజిపేట: పి.చాకరాపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోకలు పునఃప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జోగారావు చొరవతో గ్రామానికి నూతన రోడ్డు నిర్మాణం పూర్తయి తిరిగి బస్సు శనివారం నుండి పునఃప్రారంభం కావడంతో సర్పంచ్ మోహనరావు టెంకాయ కొట్టి ప్రారంభించారు. రోడ్డు మరమ్మతులకు గురవడంతో గత కొద్ది సంవత్సరాల నుండి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని, రోడ్డు నిర్మాణంతో సమస్య తీరడంతో ఎమ్మెల్యే జోగారావు ఆదేశాలతో శనివారం గ్రామానికి బస్సు వచ్చిందని సర్పంచ్ మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


పాఠశాలలకు చేరిన జేవీకే కిట్లు



పెదపెంకి పాఠశాలలో కిట్లను దింపుతున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలో 56 పాఠశాలలకు జేవీకే కిట్లు పంపిణీ చేసినట్టు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. వచ్చిన కిట్లను పాఠశాలల వారీగా కేటాయించి పాఠశాలలకు నేరుగా వాటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. సోమవారం నుండి పాఠశాలలు ప్రారంభం కానుండున్న ముందుగానే వాటిని పాఠశాలలకు చేరవేయడం జరిగిందన్నారు. 56పాఠశాలలో 3,095మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఒక బ్యాగు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు వీటన్నింటిని విద్యార్థికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా పైపులైన్ ఏర్పాటు పనులు



బాయిగట్టు వీధిలో జరుగుతున్న పైపులైన్ పనులు

పాలకొండ: నగరపంచాయతీలోని తొమ్మిదో వార్డులో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులు జోరుగా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్డు నుంచి బాయిగట్టు వీధి వరకు ఈ పైపులైన్ ఏర్పాటు చేసి, దాదాపు 150 కుటుంబాలకు తాగునీరు అందించే చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులను కౌన్సిలర్ పల్లా ధనలక్ష్మి శనివారం పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జోగారావు



గంగాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు విరబూస్తున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గంగాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా పారదర్శకంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నిరుపేదల జీవనోపాధి మెరుగుపరిచేందుకు, సమాజంలో వారిని ఉన్నత స్థానంలో ఉంచేందుకు సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. వెనుకబడిన మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు నేరుగా వారికే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మహిళా సంఘాల ద్వారా అండగా నిలుస్తున్నారన్నారు. గడప గడపకు సంక్షేమం అందుతున్నదీ.. లేనిదీ తెలుసుకునేందుకు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఉండే సమస్యలను అక్కడికక్కడే గుర్తించి వాటి పరిష్కారాన్ని సత్వరమే చేపట్టడం జరుగుతున్నాదన్నారు. అధికారులను, సచివాలయ సిబ్బందిని కార్యక్రమంలో భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందకపోతే తెలియజేయాలని కోరారు. ఇటువంటి సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.నాగమణి, ఎంపీటీసీ శంకరరావు, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సూర్యనారాయణ, బి.నారాయణరావు, సర్పంచ్ సుందరరావు, జి.లక్ష్మునాయుడు, ఆర్.సుధ, వి.గురురాజు, జగన్, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీతారాములవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్:

పార్వతీపురం మండలం కె.ములగ గ్రామంలో ఇటీవల నూతనంగా పునః నిర్మాణం చేసినటువంటి సీతారాముల వారి రామాలయం ప్రతిష్ఠ కార్యక్రమం రెండు రోజులుగా గ్రామంలో ఘనంగా జరుగుతున్నాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పాల్గొన్నారు. సీతారాముల వారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, సుభిక్షంగా ఉండాలని స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

భామిని: మండలంలోని లివిరి గ్రామ కూడలిలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూ్యరెన్స్, ఆర్‌సీ బుక్‌లను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు వివరించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ



మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని చూపిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మట్టివిగ్రహాల తయారీపై శనివారం శిక్షణ ఇచ్చారు. తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి సరళమైన పద్ధతులను అనుసరించి, వినాయకుడు, ఆంజనేయుడు విగ్రహాలతో పాటు జంతువులు, పక్షుల బొమ్మలను కూడా ఎలా తయారు చేయాలో నేర్పించారు. అనంతరం దేశ నాయకుల చరిత్ర, వారు స్వాతంత్ర్యం కోసం అందించిన సేవలను ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్ బాబు విద్యార్థులకు వివరించారు.

ఆలయ నిర్మాణానికి దాతల సహకారం



ఆలయ నిర్మాణానికి నగదు అందజేస్తున్న దాతలు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద గారమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందించారు. శనివారం ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పల్లా కొండలరావు, దూబ వెంకటరమణ తదితరులు రూ.2 లక్షలు, కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు రూ.1లక్ష, కడగల వెంకటరమణ రూ.50 వేలు, దుప్పాడ పాపినాయుడు కుటుంబ సభ్యులు శ్లాబ్ నిర్మాణానికి, జల్లు నారాయణరావు ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.3 లక్షలు, పైల తౌడు రూ.25 వేలు, దుమ్మిద సింహాచలం, ముడిల సూర్యనారాయణ రూ.15 వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన, సహకరిస్తున్న, సహకరించేందుకు ఉత్సాహం చూపిస్తున్న వారందరికీ ధన్యవాదాలని ఆలయ కమిటీ సభ్యులు కిల్లారి మోహనరావు, ఎస్.రాంబాబు తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

సాలూరు: మండలంలోని శివరాంపురం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వేడుకగా శనివారం జరిగింది. శాస్త్రోక్తంగా ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు నిర్వహించారు. గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు దండి శ్రీనివాసరావు, జర్జాపు మోహన్, మువ్వల ఆదయ్య, సాంబమూర్తి తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

అన్నదాన సత్రం నిర్మాణానికి భూమిపూజ



అన్నదాన సత్రం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీలో ముదునూరివారి వీధిలో అన్నదాన సత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం భూమిపూజ చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాన ఆవశ్యకతను గుర్తించిన జగనన్న ప్రభుత్వం మూతపడిన సత్రాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుందన్నారు. నిరుపేద విద్యార్థులకు ఈ సత్రంలో అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు వి.రాధాకృష్ణ, ప్రసాదరావు, నగరపంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ తూముల లక్ష్మణరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్‌కుమార్, పల్లా భాను, కిల్లారి మోహన్, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకు చేపడుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనుల వల్ల తాగునీటి పైప్ లైన్లు పాడయ్యాయి. దీంతో మెంటిపేట కాలనీ, మల్లికార్జున కాలనీలకు ఆదివారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీ వాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సర్వే రాళ్లు శాశ్వతంగా ఉండేలా చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: జగనన్న భూ రక్ష – భూ హక్కు పథకం అమలులో భాగంగా మండలంలోని స్వమిత్వ పథకం ద్వారా ఫేజ్ – 1లో గుర్తించిన గ్రామాల్లో గ్రామకంఠాలను గుర్తించి రీసర్వే పనులు పూర్తి చేసి నిర్ధారించిన హద్దుల్లో సర్వే రాళ్లు దీర్ఘకాలం ఉండేలా వేస్తున్నట్టు తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. తన కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న భూములు రీ సర్వేతో పాటు పంచాయతీ, సర్వే, రెవెన్యూ శాఖ అధికార సిబ్బందితో గ్రామ కంఠాలను గుర్తించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో పక్కా గృహాలు, అసంపూర్తిగా ఉన్న గృహాలు, పునాదులతో ఉన్న గృహాలు, ఖాళీ స్థలాలు, జిరాయితీ భూముల వివరాలను కార్యదర్శులు గుర్తించిన అనంతరం సర్వే సిబ్బంది, వీఆర్వోలు స్థలాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : డీఐఓ



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ జగన్మోహన్‌రావు

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాల ప్రీ స్కూలు పిల్లల ఆరోగ్య పరిరక్షణకు సమకూర్చిన ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌లను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం, కృష్ణారాయపురం, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు బూర్జ వెల్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీలకంఠాపురంలో మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన సమయానికే గ్రామాల్లో సిబ్బంది వేశారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న రోగులకు అందిస్తున్న మందులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బూర్జ ఎంఎల్ఎస్పీ, నీలకంఠాపురం, బూర్జ, కృష్ణారాయపురం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగన్నాథుని రథం కోసం ఆందోళన



నిరసనలో పాల్గొన్న హిందూ పరిరక్షణ సమితి సభ్యులు

పార్వతీపురం టౌన్: జగన్నాథుని రథం కోసం హిందూ పరిరక్షణ సమితి పార్వతీపురం పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సమితి సభ్యులు గొర్లి చంటి మాట్లాడుతూ గత మూడేళ్లుగా పార్వతీపురం పట్టణంలో ఏటా జరిగే జగన్నాథ స్వామి రథయాత్రకు రథం లేకుండా నిర్వహిస్తూ హిందూ మనోభావాలు దెబ్బతీసేలా దేవదాయ శాఖ అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా తర్వాత ఘనంగా నిర్వహించే పార్వతీపురం జగన్నాథుని రథయాత్రకు రథం లేకపోవడం ఘోరమన్నారు. గత ఏడాది రథం కోసం నిరసన చేపడితే వచ్చే ఏడాదికి సిద్ధం చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చి తప్పించుకున్నారన్నారు. ఈ ఏడాదైనా రథం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు తాళాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ఉన్న అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఇంగ్లిష్ మీడియంపై మాస్టర్ ట్రైనీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ సమావేశాలు నిర్వహించినట్లు పార్వతీపురం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉన్న 12 డిగ్రీ కళాశాలలు అధ్యాపకులకు రెండు దశలుగా సమావేశాలు నిర్వహించామన్నారు. మొదటి దశగా పార్వతీపురం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీడియా చాంబర్ వద్ద ఉమ్మడి జిల్లా డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సిబ్బందికి మాస్టర్ ట్రైనీలతో జూన్ 5తేదీ నుండి 10తేదీ వరకు శిక్షణ నిర్వహించామన్నారు. శిక్షణలో సుమారు 54 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. సంబంధిత ఇంగ్లిష్ మీడియం బోధనపై రాష్ట్ర స్థాయి చైర్మన్ తదితర డిగ్రీ కళాశాలలు అధ్యాపకులతో మీడియా సమావేశాల్లో చర్చించామన్నారు. ఉమ్మడి జిల్లాల అధ్యాపకులు పాల్గొన్నట్టు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో ఆలయాల నిర్మాణం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



సామరెల్లిలో రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. మండలంలోని పత్తికగూడ గ్రామంలో నీలమ్మతల్లి ఆలయం, సామరెల్లి గ్రామంలో రామాలయం నిర్మాణాలకు ఆమె శనివారం భూమిపూజ చేశారు. టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) ఆధ్వర్యంలో జరిగే ఈ ఆలయాల నిర్మాణానికి సంబంధించి, ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. పాలకొండ నియోజకవర్గం పరిధిలోని ఏ గ్రామంలోనైనా ఆలయాలు నిర్మించాలనుకుంటే తన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలో వీఆర్ అగ్రహారం, గడిముడిదాం, కంచరాం, తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ, పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

కొలతలు ప్రకారం పనిచేయాలి..

రేగిడి: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే ప్రతి ఒక్కరికీ రోజుకు కనీస వేతనం రూ.272 వస్తుందని ఏపీఓ హరనాథరావు అన్నారు. మండలంలోని తోకలవలస, లచ్చన్నవలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మస్తర్లలో లొసుగులు ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



గడగమ్మ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం:

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని, ఆయన తన పాదయాత్ర మొదలుకుని, సభలు, సమావేశాలు, సదస్సులు, కార్యక్రమాల్లో ఇచ్చిన ఎన్నో రకాల హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, మాటల సీఎం కాదు, చేతల సీఎంగా పేరుతెచ్చుకున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. టీడీపీ అండ్ కో తమ ఉనికిని చాటుకునేందుకు ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే జగనన్న పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పథకాల అమలుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మున్ముందు కూడా ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.